ప్రతిధ్వనించిన రామనామం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు



టీఎస్ఎన్ కాలనీలో సీతారాముల వేషధారణతో ప్రదర్శన



కాన్వెంట్ జంక్షన్ శివాలయం వద్ద.. రాముని కల్యాణం



బంగారుమెట్ట శ్రీరామాంధ్ర యువజన సమాజంలో పూజలు చేస్తున్న భక్తులు



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో పూజలు చేస్తున్న కోలా గురువులు, తదితరులు

- అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ వేళ పులకించిన భక్తజనం
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు

దాబాగార్డెన్స్: అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం, బాలరాముని ప్రాణప్రతిష్ట పురస్కరించుకొని సోమవారం దక్షిణ నియోజకవర్గంలో శ్రీరామ నామ స్మరణ మార్మోగిపోయింది. పలు రామాలయాల్లో సీతారామచంద్రస్వామి, లక్ష్మణ్ సమేత హనుమంతునికి విశేష పూజలు నిర్వహించారు. సీతారామాలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. అయోధ్యలో నిర్వహించిన బాలరాముని విగ్రహ ప్రతిష్టను ఎల్ఈడీ స్క్రీన్లపై లైవ్ ప్రోగ్రామ్ చూసి జనం తరించారు. మహారాణిపేటలోని అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు వీధుల్లో రామనామంతో ర్యాలీలు నిర్వహించారు. సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడు వేషధారణతో బళ్ల వేషాలతో ప్రదర్శనలు చేపట్టారు. దిబ్బలపాలెం రామాలయం, తాడివీధి, సాలిపేట, చెంగల్రావుపేట, రామజోగిపేట, అల్లిపురం, పెరికివీధి, కోటవీధి, రెల్లివీధి, ప్రకాశరావుపేట, వేంకటేశ్వరమెట్ట తదితర పలు రామాలయాల్లో మధ్యాహ్నం అన్నసమారాధనలు చేపట్టారు. ప్రకాశరావుపేట రామాలయం ఆర్చ్ వద్ద సీతారామచంద్రస్వామి చిత్రపటాలకు విశేష పూజలు జరిపారు. రామదండుతో ప్రదర్శన నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీనివాసరావు, లంకాడ మహేష్ ఆలయ కమిటీ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. దిబ్బలపాలెం రామాలయంలో ఆలయ అధ్యక్షుడు చందక అప్పలరాజు నేతృత్వంలో పూజలు జరిపారు.

- ప్రేమ సమాజంలో కార్యవర్గ సభ్యుడు పి.గణపతిరావు దంపతులు.. శ్రీరామునికి పూజ చేశారు. గరిమెళ్ల రాధాకృష్ణ చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం, మండా సుధారాణి శిష్య బృందం ఎస్.విష్ణుప్రియ, ఎస్.జానకీ కీర్తనలు, హనుమాన్ చాలీసా, స్వామి పురందరదాస్ మహారాజ్ ప్రవచనం, అయోధ్య శ్రీరాముని ప్రతిష్ట ప్రత్యక్ష ప్రసాదం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రేమ సమాజం కార్యదర్శి కె.హరిమోహనరావు, ఉపాధ్యక్షుడు కె.నరసింహమూర్తి, కోశాధికారి ఎంవీవీకే గుప్తా, సంయుక్త కార్యదర్శి వీకే సురేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు కోన జగదీశ్వరరావు, ఉప్పల భాస్కరరావు, భగవత్ పరమేశ్వర్, కె.కృష్ణారావు, ఎల్.వెంకట్రావు, ఆశ్రమ వాసులు, స్కూల్ విద్యార్థినులు పాల్గొన్నారు.
- పాతనగరం కురుపాం మార్కెట్ సమీప కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అష్టోత్తర కలశాభిషేకం, అర్చనలు, పంచ హారతులు, హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామ భజన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ ఆస్థాన పురోహితుడు ఆర్‌బీబీ కుమార్ శర్మ, ఆలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, కోశాధికారి సుగ్గు శివకుమార్ పాల్గొన్నారు.

పాతనగరంలో

దాబాగార్డెన్స్: పాతనగరం లక్ష్మీటాకీస్ సమీప ఆంజనేయస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

వాడవాడలా సీతారాముల కల్యాణోత్సవాలు

జగదాంబ: అయోధ్యలో జరుగుతున్న బాలరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నేపథ్యంలో సోమవారం పూర్ణా మార్కెట్ సమీపంలో సీతారామ కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 35వ వార్డు పూర్ణా మార్కెట్ వద్ద గుజరాతీ మార్వాడీలు, రాజస్థానీ మార్వాడీలు, పండుపుల్లల సందు, పూలసందు, రామకృష్ణనగర్, పూర్ణా మార్కెట్ జంక్షన్ వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. మార్కెట్‌లో రామభక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. సంకీర్తనలు ఆలపించారు. కొన్నిచోట్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని స్క్రీన్‌లు ఏర్పాటు చేసి తిలకించారు.

ప్రత్యేక పూజలు..అన్నసమారాధనలు

అల్లిపురం: అయోధ్యలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్టాపన కార్యక్రమం సందర్భంగా ఊరు వాడా రామనామ జపంతో మార్మోగాయి. మెయిన్‌రోడ్డు రామాలయంలో, గోవింద్ రోడ్డు శ్రీరామ మందిరంలోను, బంగారుమెట్ట శ్రీరామాంధ్ర యువజన సమాజం, గౌరీ సేవా సంఘం, వెంకటేశ్వరమెట్ట ఆంజనేయస్వామి ఆలయంలో, కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఆలయ గౌరవాధ్యక్షుడు పీల చిన అప్పలనాయుడు పానకం తయారు చేసి భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్, గణేష్, వాసుపల్లి నారాయణ పాల్గొన్నారు.



శ్రీరాముడు చిత్ర పటానికి పూజలు చేస్తున్న ఆహార తోపుడు బండ్ల సంక్షేమ సంఘం సభ్యులు



మహిళకు చీర, బియ్యం అందిస్తున్న రాము



అన్నదానం ప్రారంభిస్తున్న కోలా గురువులు

అల్లిపురం: బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా వైఎస్సార్‌సీపీ 33వ వార్డు నాయకుడు పచ్చిరిపల్లి రాము సోమవారం పేదలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు.

- అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా సోమవారం అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, సభ్యులు కన్నూరు గంగ, లక్ష్మీకాంతం, బొర్రా శ్రీనివాసరెడ్డి, టి.అనురాధ, తాడి సత్యవతి పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు పులిహోర ప్రసాదంతో పాటు పానకం పంపిణీ చేశారు.
- బంగారుమెట్టలో వెలసిన శ్రీ షిరిడీ సాయి దేవాలయంలో సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మహారాణిపేట: నగర ఆహార తోపుడు బండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యూ మోడ్రన్ హాకర్ జోన్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద శ్రీరాముడి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రూపాకుల రవికుమార్, అధ్యక్షుడు దాకమర్రి బాలాజీ, ఉపాధ్యక్షుడు దాకమర్రి సింహాచలం పాల్గొన్నారు.



ప్రకాశరావుపేట రామాలయం వద్ద..



ఆంజనేయస్వామి ఆలయంలో పూజ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్



దీపాలతో రామనామ భజనలు చేస్తూ రామాలయాలను సందర్శిస్తున్న భజన బృందం



పానకం పంపిణీ చేస్తున్న పీలా వెంకట అప్పలనాయుడు

క్లుప్తంగా

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్త రోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని ఆలయ అధికారులు తెలిపారు.

కల్యాణ మండపంలో అదనపు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి తదితరులు

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డులో స్థానిక అచ్చియ్యమ్మపేటలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపంలో అదనపు పనులకు వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి సోమవారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఇప్పటికే మొదటి అంతస్తులో నిర్మాణానికి మరో రూ.49 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆ పనులు మొదలు పెట్టేందుకు పూజలు చేశారు. అదేవిధంగా ఇప్పటికే రూ.16 లక్షల వ్యయంతో కల్యాణ మండపం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తిచేసి వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, దూడ అప్పారావు, తాతబ్బాయి, భాస్కరరావు, సూరిబాబు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న సాయి బలరాం, సూరాడ అప్పారావు

దాబాగార్డెన్స్: పాతనగరం స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి, సంక్రాంతి పండగ పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. సంస్థ వ్యవస్థాపక సభ్యుడు సాయిబలరాం చేతుల మీదుగా పలువురు మహిళలకు బహుమతులతో పాటు, స్వామి వివేకానందుని జీవిత చరిత్ర పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల నిరసన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

మహారాణిపేట: తెన్నేటి పార్కు వద్ద చిరు వ్యాపారులకు అనుమతించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఫుట్‌పాత్ ఫ్రూట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో పలువురు చిరు వర్తకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, ఇతర నాయకులు జి.బాలకృష్ణ, మోహన్, బి.బాలకృష్ణ, లక్ష్మణరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో నూరు శాతం ఫలితాలే లక్ష్యం

- విద్యార్థులకు డీఈవో చంద్రకళ సూచన
- డాబాగార్డెన్స్ మున్సిపల్ హైస్కూల్ సందర్శన



విద్యార్థులకు సూచలిస్తున్న డీఈవో ఎల్.చంద్రకళ

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఈ ఏడాది పదో తరగతిలో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా చదవాలని డీఈవో ఎల్.చంద్రకళ విద్యార్థులకు సూచించారు. సోమవారం మధ్యాహ్నం ఆమె డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో ఆమె మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆమె తరగతుల జరుగుతున్న తీరును, విద్యార్థుల హాజరు, తదితర వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీఎస్ఎస్ నాగభూషణంను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పదో తరగతి సిలబస్ పూర్తయిందని, పాఠాలు పునశ్చరణ చేసుకోవాలన్నారు. అనుమానాలు ఏమైనా ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టును ప్రణాళికాబద్ధంగా చదివి నూరు శాతం మార్కులు సాధించాలన్నారు.

నిలకడలేని రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ షర్మిల



మాట్లాడుతున్న సనపల రవీంద్ర

దాబాగార్డెన్స్: నిలకడలేని రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా షర్మిల మారారని ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పొరేషన్ డైరక్టర్, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి సనపల రవీంద్ర భరత్ ఆరోపించారు. దక్షిణ నియోజకవర్గ పరిధి పాతనగరంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన షర్మిల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై చేసిన విమర్శలకు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులుగా తామెంతో బాధపడతున్నామని, తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణాలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తామని, స్వయంగా తాను పాలేరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని చెప్పిన షర్మిల, ఏపీలో ఎవరికి పాలేరుతనం చేయడానికి వచ్చారో చెప్పాలన్నారు. తెలంగాణలో పోటీ చేయక పోగా హఠత్తుగా నోటాతో పోటీ పడతున్న కాంగ్రెస్ పార్టీలో చేరి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడం కోసం పార్టీలో చేరుతున్నట్టు ఆమె చెప్పిన మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. ఎవరి డైరెక్షన్లో, ఎవరికి మేలు చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నారో ప్రజలంతా గమనిస్తున్నారని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తూ ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరికరంపై శిక్షణ



శిక్షణలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్ దంత విభాగంలో నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ పరికరం ట్రైనింగ్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. అనకాపల్లి, అమలాపురం, పార్వతీపురం, పాడేరు, కోనసీమ నుంచి వైద్యులు శిక్షణ కోసం వచ్చారు. వెల్‌స్కోప్ రిసోర్స్ పరికరం ఎలా వాడాలి, దాని ఉపయోగాలను డాక్టర్ దర్షనా వివరించారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మి తులసీ, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్, దంత విభాగాధిపతి డాక్టర్ త్రివేణి, వైద్యులు డాక్టర్ వినోద్, లవాణ్య, హరిత, డాక్టర్ సుకుమార్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



మృతదేహం

గోపాలపట్నం: గోపాలపట్నం రైల్వే స్టేషన్, డీ కేబిన్ మధ్యలో రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని మృతదేహాన్ని గవర్నమెంట్ రైల్వే పోలీసులు సోమవారం గుర్తించారు. జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 40 ఏళ్ల గల వ్యక్తి ట్రాక్‌పై మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఎలాంటి వివరాలు లభించలేదు. 5.5 అడుగుల ఎత్తుకలిగి, లేత నీలం రంగు టీషర్టు, నీలం రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతుడి గుర్తించిన వారు ఎస్ఐ బాలాజీ రావు 96661227222, సీఐ సీహెచ్ ధనుంజయనాయుడు 9440627547 నంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

అల్లిపురం: పాఠశాల స్థాయి విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించడమే ధ్యేయంగా సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ విద్యార్థులు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం డాబాగార్డెన్స్‌లో గల జీవీఎంసీ మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో పాఠశాల విద్యార్థులకు చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగభూషణం, వర్సిటీ ఆచార్యులు డాక్టర్ బీవీఎస్ సునీత, డాక్టర్ పి.భువనేశ్వరి, కమిటీ సభ్యులు కె.దివ్యశ్రీ, జి.చరిష్మా, ఎస్.షర్మిష్టశ్రీ, సీహెచ్ పవన్ కృష్ణ, జి.హర్షవర్ధన్‌రెడ్డి, జి.ప్రితమ్, జె.సాయిసాకేత్, ఎం.మనోజ్‌రాహుల్, ఎం.అమృత్ వర్షిణి, వై.జస్వంత్ పాల్గొన్నారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

మల్కాపురం: తల్లిదండ్రులు మందలించారన్న కారణంతో ఓ బాలిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి గాజువాక పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద దొడ్డి బాబూజీ భార్య, కుమార్తె, కుమారుడితో కొద్దికాలంగా నివసిస్తున్నారు. ఆయన కుమార్తె (16) స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. బాలిక తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతుండడంతో తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో ఈ నెల 21న సాయంత్రం బాలిక బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా, ఆమె సోదరుడు అడ్డుకుని తల్లికి చెప్పడంతో ఆమె మందలించారు. దీంతో బాలిక గదిలోకి వెళ్లి తలుపు వేసుకుంది. సోమవారం ఉదయం 8 గంటలు అయినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు తలుపు పైభాగంలో అద్దం పగలకొట్టి చూడగా, గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వారు వెంటనే గాజువాక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి, బాలిక మృతిపై ఆరా తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాజువాక సీఐ లంకా భాస్కరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా రవాణా వినియోగంతో కాలుష్య నివారణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరి వెంకటకుమారి



తన బంగ్లా నుంచి జీవీఎంసీకి సైకిల్‌పై వస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

దాబాగార్డెన్స్: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని కొంత వరకు నివారించవచ్చునని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం ఏపీఎస్ ఆర్టీసీ బస్సులో, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతో పాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. ఎకో-వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతుందన్నారు. ఇందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎంసీలో యోగా యూనిట్ ప్రారంభం



యోగా యూనిట్ ప్రారంభంలో ప్రిన్సిపాల్ బుచ్చి రాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో యోగా యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగా వ్యక్తిత్వ వికాసానికి, ఏకాగ్రత పెంచుకునేందుకు దోహదపడుతుందన్నారు. యోగాతో అధ్యయనాలు నిర్వహించడంలో యోగా సెల్ ఉపయోగపడుతుందని రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌వీఎస్‌కే రవి కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్, డాక్టర్ వి.మన్మథరావు, డాక్టర్ పద్మ గీతాంజలి, ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: నెల్లూరుకు చెందిన నవీన్, సురేష్ ఏడు కిలోల గంజాయి తరలిస్తుండగా గోపాలపట్నం రైల్వేట్రాక్ పక్క రోడ్డులో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం పట్టుకున్నారు. వివరాలు.. అరకు ప్రాంతంలో కొనుగోలు చేసిన గంజాయిని బ్యాగుల్లో నెల్లూరు తరలించేందుకు యత్నిస్తున్నారు. గోపాలపట్నం శ్మశానవాటిక వెనుక రోడ్డులో వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. 7 కిలోల గంజాయి, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి పురస్కార గ్రహీతలకు అభినందన



పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి, వలంటీర్లకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పోల ఉమామహేశ్వరరావు, గైట్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని డి.లక్ష్మీశ్రీలేఖ రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. ఈ నెల 12న జరిగిన కార్యక్రమంలో వారు అవార్డులను స్వీకరించారు. ఈ మేరకు సోమవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అవార్డు గ్రహీతలను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.